sahanamvande.com

epaper.sahanamvande.com

సహనం వందే

హైదరాబాద్ | 13-08-2026 గురువారం | సంపుటి-02 సంచిక : 127 EDITOR: ROHINI



కేంద్రం కుట్రను ఎదిరించిన ద్రవిడ గడ్డ

తమిళనాడు అసెంబ్లీ సంచలన తీర్మానం

- పార్లమెంటు సీట్లు యథావిధిగా ఉంచాలి
- ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి విజయ్ డిమాండ్
- దక్షిణాదిపై కుట్ర జరుగుతోందని విమర్శ
- సౌత్ నుంచి ప్రధాని ఎందుకు కాకూడదు?
- అసెంబ్లీలో మంత్రి వ్యాఖ్యలపై దుమారం

దక్షిణాది గొంతు నొక్కే కుట్రపై తమిళనాడు అసెంబ్లీ రగిలిపోయింది. దక్షిణాది రాష్ట్రాల ఎంపీ సీట్లను తగ్గించే కుట్రను సహించేది లేదని స్పష్టం చేసింది. లోక్‌సభ స్థానాలను ప్రస్తుతం ఉన్న 543 సీట్లకు కట్టడి చేయాలని డిమాండ్ చేస్తూ అసెంబ్లీలో సంచలన తీర్మానం ఆమోదించింది. మహిళా రిజర్వేషన్లను వెంటనే అమలు చేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేయడంతో రాజకీయ వేడి రాజుకుంది.

- సహనం వందే, తమిళనాడు

జనాభా నియంత్రణ పాటించిన దక్షిణాది రాష్ట్రాలకు కేంద్రం నుంచి పెను ముప్పు పొంచి ఉంది. జనాభా ప్రాతిపదికన డీలిమిటేషన్ చేపడితే దక్షిణాది రాష్ట్రాల ఎంపీల సంఖ్య భారీగా పడిపోయే ప్రమాదం ఉంది. దీనివల్ల రాజకీయ ప్రాతినిధ్యంలో తీవ్రమైన అన్యాయం జరుగుతుందని తమిళనాడు ప్రభుత్వం తేల్చిచెప్పింది. ఇదే అంశంపై తమిళనాడు అసెంబ్లీలో బుధవారం ముఖ్యమంత్రి విజయ్ కీలక తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ప్రస్తుతమున్న 543లోక్‌సభ స్థానాలను అలాగే ఉంచాలని, అంతర్రాష్ట్ర సీట్ల పంపిణీ నిష్పత్తిని మార్చకూడదని తీర్మానంలో స్పష్టం చేశారు.

కుట్రను ఎదిరించిన ద్రవిడ గడ్డ

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లు, డీలిమిటేషన్ బిల్లు దక్షిణాది గొంతు కోసే ప్రయత్నమే నని అధికార పార్టీ మండిపడింది. ఈ ఏడాది ఏప్రిల్ 17వ తేదీన ఈ బిల్లు లోక్‌సభలో మూడింట రెండు వంతుల మెజారిటీ సాధించలేక వీగిపోయింది. ఏప్రిల్ 16వ తేదీన డీలిమిటేషన్ బిల్లును డీఎంకే నేత ఎం కే స్టాలిన్ దహనం చేశారు. లోక్‌సభ రాజ్యసభ నిష్పత్తి 2.2:1గానే కొనసాగాలని తీర్మానం డిమాండ్ చేసింది. ప్రతిపాదిత డీలిమిటేషన్ వల్ల దక్షిణాది రాష్ట్రాల పార్లమెంటరీ ప్రతినిధులు భారీగా తగ్గిపోయే ప్రమాదం ఉందని ముఖ్యమంత్రి విజయ్ హెచ్చరించారు. ప్రతి రాష్ట్రంలోనూ లోక్‌సభ సభ్యుల సంఖ్య 50శాతం పెరిగినా జనాభా ఆధారంగా నియోజకవర్గాలను పునర్వ్యవస్థీకరిస్తే దక్షిణాది రాష్ట్రాల ఎంపీల సంఖ్య భారీగా పడిపోతుందని హెచ్చరించారు.

మహిళా రిజర్వేషన్ల కోసం పోరు

మహిళలకు రాజకీయాల్లో తగిన అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందని ముఖ్యమంత్రి విజయ్ పేర్కొన్నారు. 2023వ సంవత్సరంలో పార్లమెంటులో 106వ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా మహిళలకు మూడింట ఒక వంతు రిజర్వేషన్ కల్పించారు. అయితే జనాభా లెక్కలు, డీలిమిటేషన్ ప్రక్రియ తర్వాతే ఇది అమలవుతుందని కేంద్రం చెప్పడం మోసపూరితమని మండిపడ్డారు. జనాభా లెక్కలు, డీలిమిటేషన్‌తో మహిళా రిజర్వేషన్లను ముడిపెట్టవద్దని డిమాండ్ చేశారు. ప్రస్తుతమున్న 543 సీట్ల ఆధారంగానే 2029 లోక్‌సభ ఎన్నికల్లో 33 శాతం మహిళా రిజర్వేషన్లను ఎటువంటి ఆలస్యం లేకుండా అమలు చేయాలని కోరారు.

ప్రతిపక్ష పార్టీల మాటల యుద్ధం..

ఈ తీర్మానాన్ని ఏఐఏడీఎంకే, పీఎంకే, డీఎండీకే, బీజేపీ పార్టీలు తీవ్రంగా వ్యతిరేకించాయి. పార్లమెంటులో తమిళనాడు ప్రాతినిధ్యం తగ్గబోదని కేంద్ర హోంమంత్రి అమిత్ షా హామీ ఇచ్చారని ఏఐఏడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి తెలిపారు. రాజకీయ సంచలనం సృష్టించడానికే ఈ తీర్మానం తెచ్చారని ఆరోపించారు. మరోవైపు డీఎంకే సహా పలు పార్టీలు ఈ తీర్మానానికి సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. వ్యతిరేకించిన పార్టీలు సైతం మహిళా రిజర్వేషన్ల అమలును సమర్థించడం విశేషం.

దక్షిణాది నుంచి ప్రధాని...

అధికార టీవీకే పార్టీకి చెందిన మంత్రి అడు అర్జున అసెంబ్లీలో చేసిన వ్యాఖ్యలు ఉత్తర, దక్షిణ భారతాల మధ్య మరోసారి రాజకీయ అగ్గిని రాజేశాయి. ప్రధాని పదవికి దక్షిణాది నేత ఎందుకు అర్హుడు కాదని ఆయన ప్రశ్నిస్తున్న తీరు జాతీయ రాజకీయాల్లో కొత్త చర్చకు తెరలేపింది. దశాబ్దాలుగా నలుగుతున్న ఉత్తర, దక్షిణ భారత వివక్షను ఆయన తన ప్రకటనతో మరోసారి తీవ్రతరం చేశారు. దక్షిణాది రాష్ట్రాలు ఆర్థికంగా, సామాజికంగా దేశ పురోగతిలో కీలక పాత్ర పోషిస్తున్నాయని ఆయన నొక్కి చెబుతున్నారు.

వెయ్యి నకిలీ పెళ్లిళ్లు

వెలుగులోకి అతిపెద్ద మ్యారేజ్ ఫ్రాడ్ స్కీమ్

- అమెరికా గ్రీన్‌కార్డ్ కోసం పెళ్లిళ్ల మాఫియా
- ఉత్తుత్తి పెళ్లికి కోటి రూపాయలు వసూలు
- నకిలీ బంధువులు... అద్దె స్నేహితులు
- న్యూయార్క్‌లో 11 మంది ముఠా అరెస్టు
- పెళ్లిళ్ల బజార్... మోసాల దర్బార్

అమెరికా గ్రీన్ కార్డ్ కోసం కాగితాలపై నకిలీ పెళ్లిళ్లు చేస్తూ కోట్లు దండుకున్న అంతర్జాతీయ ముఠా గుట్టును ట్రంప్ ప్రభుత్వం రట్టు చేసింది. పదేళ్ల కాలంలో ఏకంగా వెయ్యికి పైగా బూటకపు వివాహాలు జరిపిస్తూ శాశ్వత నివాస హోదా ఇప్పిస్తున్న 11 మంది న్యూయార్క్‌లో ఫెడరల్ అధికారులు అరెస్టు చేశారు. - సహనం వందే, అమెరికా

అమెరికాలో శాశ్వతంగా స్థిరపడాలని భావించే విదేశీయుల బలహీనతను ఆసరాగా చేసుకుని ఈ భారీ మోసాల నెట్‌వర్క్ పుట్టుకొచ్చింది. చట్టబద్ధంగా గ్రీన్ కార్డ్ పొందడం కష్టమవడంతో అమెరికా పౌరులను పెళ్లి చేసుకోవడమే సులభమైన మార్గమని నమ్మించి ఈ ముఠా రంగంలోకి దిగింది. పదేళ్ల పాటు సాగిన ఈ మోసపు ఉచ్చును అమెరికా న్యాయ శాఖ బట్టబయలు చేసింది. ప్రధానంగా చైనా దేశ పౌరులను టార్గెట్ చేస్తూ సోషల్ మీడియా ద్వారా ఈ దందాను కోట్లలో నడిపించారు.

న్యూయార్క్ కేంద్రంగా రహస్య నెట్‌వర్క్...

ఈ భారీ మోసానికి సూత్రధారులుగా వ్యవహరించిన 11 మంది నిందితులను అధికారులు అరెస్టు చేశారు. న్యూయార్క్ కేంద్రంగా పనిచేస్తున్న ఈ ముఠాలో వివిధ వయసుల వారు, మహిళలు కూడా ఉండటం విశేషం. కేవలం న్యూయార్క్ మాత్రమే కాకుండా కనెక్టికట్, కెంటకీ, టెన్నెస్సీ వంటి ఇతర రాష్ట్రాలకు కూడా ఈ మోసాల వేర్లు విస్తరించాయి.

కోటి రూపాయలు వసూలు...

అమెరికాలో అడుగుపెట్టి ఎలాగైనా స్థిరపడాలని భావించే విదేశీయులను ఈ ముఠా టార్గెట్ చేసింది. ముఖ్యంగా చైనా నుంచి వచ్చే జాతీయత కలిగిన వ్యక్తులను ఎంచుకుని వారికి గాలం వేశారు. సోషల్ మీడియా వేదికగా, అలాగే నోటి మాట ద్వారా ప్రచారం చేస్తూ తమ వ్యాపారాన్ని విస్తరించుకున్నారు. ఈ నకిలీ వివాహాల కోసం ఆ ముఠా వసూలు చేసిన మొత్తాలు వింటే నిజంగానే దిమ్మతిరిగిపోతుంది. ఈ గ్రీన్‌కార్డ్ కోసం ఏకంగా లక్ష అమెరికన్ డాలర్లు, అంటే దాదాపు కోటి రూపాయల వరకు చెల్లించారు. ఈ భారీ మొత్తంలో కొంత భాగాన్ని నకిలీ పెళ్లికి అంగీకరించిన అమెరికా పౌరులకు కమిషన్‌గా ఇచ్చేవారు.

అధికారులను బురిడీ కొట్టించేలా పెళ్లిళ్లు...

కేవలం డబ్బులు తీసుకుని వదిలేయకుండా ఇమిగ్రేషన్ అధికారులను నమ్మించడానికి ఈ ముఠా పెద్ద నాటకమే ఆడింది. నిజమైన భార్యాభర్తలే అని అధికారులను నమ్మించేందుకు ప్రతి అడుగులోనూ జాగ్రత్తలు తీసుకున్నారు. అమెరికా పౌరులతో కాగితాల మీద మాత్రమే పెళ్లి ఒప్పందాలు కుదుర్చుకుని వాటిని బయట ప్రపంచానికి నిజమైనవిగా చిత్రీకరించారు. పెళ్లిళ్ల పేరుతో ప్రత్యేకంగా పెద్ద వేడుకలను కూడా ప్లాన్ చేసేవారు. బంధువులు, స్నేహితులను చుట్టూ కూర్చోబెట్టి పెళ్లి ఫోటోషూట్లు నిర్వహించేవారు. రెస్టారెంట్లలో సాంప్రదాయ పెళ్లి దుస్తులు ధరించి మరీ ఫోటోలకు ఫోజులిచ్చి వాటిని అధికారులకు సమర్పించారు.

ఫెడరల్ ఏజెన్సీల రంగప్రవేశం...

ఈ దందా కేవలం ఒక ప్రాంతానికి పరిమితం కాకుండా అమెరికా వ్యాప్తంగా విస్తరించడంతో ఫెడరల్ ఏజెన్సీలు రంగంలోకి దిగాయి. ఈ ఆపరేషన్‌ను పక్కాగా అమలు చేశాయి. సుదీర్ఘ కాలంగా జరుగుతున్న ఈ అక్రమ వలసల నెట్‌వర్క్‌పై నిఘా పెట్టి అసలు గుట్టును రట్టు చేశారు. పదేళ్ల కాలంలో సుమారు 1000కి పైగా బూటకపు వివాహాలు జరిగాయని దర్యాప్తులో స్పష్టమైంది. అమెరికా చరిత్రలోనే అతిపెద్ద మ్యారేజ్ ఫ్రాడ్ స్కీమ్‌లలో ఇది ఒకటిగా అధికారులు అభివర్ణించారు.

ముంబైని షేక్ చేస్తున్న ఐఏఎస్

21 ఏళ్లు... 25 బదిలీలతో సత్కారం!

- ఆహార, మందుల కల్తీలపై ఉక్కుపాదం
- నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్య
- హోటళ్ళు, మందుల వ్యాపారులకు దడ

TUKARAM MUNDHE

మహారాష్ట్రలో ఇప్పుడు ఒకే ఒక పేరు మారుమోగుతోంది. అది తుకారాం ముండే. ఆహార, మందుల నాణ్యతపై ఆయన చేస్తున్న మెరుపు దాడులు పెద్ద దుమారమే రేపుతున్నాయి. సామాన్యుల ఆరోగ్యం కోసం ఆహార, మందుల వ్యాపారాల్లో జరుగుతున్న అవకతవకలపై ఆయన కొరడా ఝుళిపిస్తున్నారు. ఎవరెన్ని ఒత్తిడులు తెచ్చినా వెనక్కి తగ్గకుండా వ్యవస్థను ప్రక్షాళన చేయడమే ధ్యేయంగా ఈ ఐఏఎస్ అధికారి సాగుతున్నారు. - సహనం వందే, మహారాష్ట్ర

మహారాష్ట్ర ఆహార, మందుల పరిపాలన విభాగానికి కమిషనర్‌గా తుకారాం ముండే బాధ్యతలు చేపట్టిన వెంటనే దూకుడు పెంచారు. మే 25వ తేదీ నుంచి ఆయన సారథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా హోల్ సేలర్లు, తయారీదారులు, రిటైలర్లు, రెస్టారెంట్లపై వరుస దాడులు జరుగుతున్నాయి. ఎక్కడైతే నిబంధనల ఉల్లంఘనలు బయటపడుతున్నాయో అక్కడ తక్షణమే లైసెన్సులను సస్పెండ్ చేస్తున్నారు. శాంపిల్స్ స్వాధీనం చేసుకుని చట్టపరమైన కఠిన చర్యలు చేపడుతున్నారు.

బదిలీలే ఆయన ఆయుధం

ఒక అధికారికి బదిలీలు శాపంలా కనిపిస్తాయి. కానీ తుకారాం ముండే విషయంలో అవి ఆయనకు గుర్తింపుగా మారాయి. 21 ఏళ్ల సుదీర్ఘ సర్వీసులో ఆయన ఏకంగా 25 సార్లు బదిలీ అయ్యారు. ఈ బదిలీల సంఖ్యే ఆయన పని తీరుకు అద్దం పడుతుంది. అంటే ఎక్కడా కూడా ఆయన కనీసం ఏడాది కూడా పూర్తిగా పనిచేయలేదని అర్థం అవుతుంది. వ్యవస్థలో ఉన్న లోపాలను ఎత్తిచూపిన ప్రతిసారీ ఆయనకు ఇలాంటి పరిణామాలు ఎదురయ్యాయి. అయినా సరే ఆయన తన బాటను మాత్రం మార్చుకోలేదు.

బేడ్ గడ్డ నుంచి ఉన్నత శిఖరాలకు

ఈ కఠిన నిబంధనల అధికారి నేపథ్యం చాలా సాధారణం. మహారాష్ట్రలోని బేడ్ ప్రాంతానికి చెందిన ఈయన... తన కుటుంబంతో కలిసి వ్యవసాయ పనుల్లో చేదోడువాదోడుగా ఉండేవారు. అటువంటి కుటుంబం నుంచి వచ్చి నేడు అత్యంత శక్తివంతమైన అధికారిగా ఎదిగారు. క్షేత్రస్థాయి నుంచి వచ్చిన అనుభవం వల్లే ప్రజల కష్టాలు, వ్యాపారుల అక్రమాలను ఆయన సులువుగా పసిగట్టగలుగుతున్నారు.

నిబంధనలే పరమావధిగా...

ముండే దాడులు కేవలం నామమాత్రం కావు. ఆయా రెస్టారెంట్లు, తయారీ కేంద్రాల్లో నిబంధనల అమలు ఎలా ఉందో నిశితంగా పరిశీలిస్తారు. అపరిశుభ్రత, నాణ్యత లోపం ఎక్కడ కనిపించినా ఉపేక్షించేది లేదు. ముంబైలోని కొన్ని ప్రముఖ హోటళ్లు కూడా ఈ దాడుల వల్ల మూతపడ్డాయంటేనే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. ఆయన వస్తున్నారంటేనే వ్యాపార వర్గాల్లో ఆందోళన మొదలవుతోంది.

అలుపెరుగని పోరాటం

రాజకీయ ఒత్తిళ్లు, సామాజిక విమర్శలు ఎలా ఉన్నా తుకారాం ముండే ప్రస్థానం ఆశ్చర్యం కలిగిస్తుంది. ఆయనకు వ్యవస్థలో మార్పు తీసుకురావాలనే తపన ఎక్కువగా ఉంది. కేవలం ఒక సీటులో కూర్చొని ఫైళ్లపై సంతకాలు చేయడమే కాకుండా స్వయంగా క్షేత్రస్థాయికి వెళ్లి పర్యవేక్షించడం ఆయన ప్రత్యేకత. అందుకే ఆయనకు క్రమశిక్షణ గల అధికారిగా మంచి పేరు ఉంది.

ప్రజల మద్దతు...

తుకారాం ముండే తీసుకుంటున్న ఈ చర్యలపై ప్రజల నుంచి మంచి స్పందన వస్తోంది. ఆహార భద్రత విషయంలో ఆయన చూపిస్తున్న నిబద్ధత అందరికీ ఆదర్శంగా నిలుస్తోంది. భవిష్యత్తులో కూడా ఇదే తరహా దాడులు కొనసాగితే మహారాష్ట్ర ఆహార, ఔషధ రంగాల్లో పెను మార్పులు రావడం ఖాయమని విశ్లేషకులు చెబుతున్నారు. వ్యవస్థలో మార్పు రావాలంటే ఇలాంటి అధికారులు అవసరమని సామాన్య ప్రజలు భావిస్తున్నారు.